సాహిత్య శీర్షిక


# స్వస్తి

కె. వరలక్ష్మి



మా ఊళ్లో సీతమ్మ తల్లి గుడి ఉంది కదా!.... కష్టాలె న్నొచ్చినా కిక్కురు మనకుండా సహనంతో భరాయించిన నోరూవాయీలేని సీతమ్మకి గుడేవిటని ఆశ్చర్యపోకండి. నాకు తెలుసు, గుళ్లో దైవంగా కొలువుండాలంటే వాడు అజానుబాహువై, అరవింద దళాయి తాక్షుడై, రాగ ద్వేషాలు సమపాళ్లలో ఉన్నవాడై, వెనకాముందూ చూడకుండా ఎదుటివాళ్లని మట్టుబెట్టగల సాహసోపేతుడై, కొంచెం మాయలూ మరిన్ని మంత్రాలూ, కొద్దిపాటి రాక్షసత్వం కొలతలేని శృంగారలోలత్వం లాంటి క్వాలిఫికేషన్స్ కలిగి ఉండాలని, నిజానికి వైభవం కోల్పోయి ఊరి చివర ఒంటరి ఒంటెలా ఉండేది, ఆగుళ్లో అర్చకుడుగా ఉన్న క్రిష్ణమాచారి తోడూ నీడా లేని గాలి జీవితం గడుపుతూ ఉండేవాడు.

పొద్దున్నే ఓగిద్దెడు బియ్యం వార్చి విగ్రహాల ముందు నైవేద్యంగా రెండు నీళ్లచుక్కల్తో ప్రోక్షించి, దాన్ని బైటకు తెచ్చుకుని ఏపెద రెడ్డిగారి పెళ్లామో పంపించిన మజ్జిగ నీళ్లోసుకుని ఆరగించి ఆరోజు భోజనమైందనిపించేవాడు. పళ్లెంలో పడిన చిల్లర డబ్బుల్ని అలాగే పట్టుకెళ్లి ముత్యాలమ్మ పాకలో పేకాటకు కూర్చునేవాడు. అలాంటి క్రిష్ణమాచార్ని



మా ఊరిగుళ్లో సీతమ్మతల్లితోబాటు ఆమెగారి భర్తగారు, మరదిగారు, నమ్మినబంటుగారు కూడా ఉన్నారు. వచ్చిన చిక్కల్లా ఏవిటంటే ఆవిగ్రహాలు చెక్కిన శిల్పి ఎవడోకాని సీతమ్మతల్లి భక్తుడో, భక్తఫెమినిస్టో అయి ఉండాలి. అందుకే గుళ్లో అడుగుపెట్టగానే చేతులు జోడించాలన్పించేలా చిరునవ్వులు చిందిస్తూ సీతమ్మనీ, పరికించి చూస్తేగాని కన్పించని ఒక్కరూపాల్లో రామలక్ష్మణుల్నీ రూపొందించేడు. మరందుకే వచ్చిందో, ఆలయానికన్నీ తానే అయి నెట్టుకొస్తున్న పూజారి క్రిష్ణమాచారి భార్య సీతమ్మవల్ల ఆ పేరొచ్చిందో తెలీదు కాని మొత్తానికది సీతమ్మతల్లి గుడి అయ్యింది. నిజానికి దంతా అప్రస్తుత ప్రసంగం.

నేను చెప్పాలనుకున్నది రెండో సీతమ్మకథ ....సీతమ్మ కాపరానికొచ్చేసరికి గుడికొ దారిలో పెట్టాలని ఊరి పెద్దలంతా కూడ బలుక్కుని పక్కవూరి కోవెలపూజారి హనుమంతాచారి అయిదోకూతురు సీతమ్మనిచ్చి పెళ్లి జరిపించారు. ఒంటి మీదున్న పసుపు చీరకాక వాళ్లమ్మవి రెండు నేత చీరలూ, ఒక మడిబట్ట, పెళ్లికికొన్న ఫేన్సీ పట్టుచీరా, ఒకరాగి పంచపాత్రా, రెండు ఇత్తడి లోటాలూ, పూర్వీకులనాటి రామాయణ గ్రంథమూ పాతట్రంకు పెట్టెలో పెట్టుకుని క్రిష్ణమాచారి వెంట కాలినడకన మెట్టినింటి కొచ్చింది సీతమ్మ.

గుడి ఆవరణలో పూజారి కుటుంబం కోసం కట్టబడిన పెట్టెగదీ చిన్నవసారా కొత్తగా కాపరానికొచ్చిన సీతమ్మ కంటికి రాజభవనంలా కన్పించాయి.

లంకంత ఆవరణంతా రెక్కలు ముక్కలయ్యేట్టు శుభ్రం చేసి పూలమొక్కలూ, కూరపాదులూ నాటింది. దొరువులు కట్టి నీరుపారే ఏర్పాటు చేసింది. నీళ్లు తోడిపోస్తున్న ఓసాయంత్రం వేళ దడి కవతల గిన్నెలు తోముకుంటున్న నన్నారీబేగం పరిచయమైంది సీతమ్మకి. సీతమ్మ కన్నా రెండునెల్లు ముందు కాపరానికొచ్చిన నన్నారి పరుపులు కుట్టేపీర్ సాయెబు పెళ్లాం.

"మీరు శానా బాగున్నారమ్మాయిగారూ" అంది నన్నారీ సీతమ్మని పలకరిస్తూ "ఎంత తెలుపో మీ ఒంటి రంగు"

సీత సిగ్గుపడింది. తర్వాత కన్రెప్పలెత్తి ఇంచుమించు తన ఈడుదే అయిన ఆమెని పరికించి చూసింది. నల్లజీడిగింజ రంగు శరీరం, తెల్లగా మెరిసిపోతున్న పళ్లు.

"నీ పేరేఁవిటీ?" అంది సీత.

"బేగం నన్నారీ"



"బీబీనాంచారా?" సీత పలికిన తీరుకి నవ్వాపుకోలేక గిన్నెలు కడుగుతున్న బురదలోనే చతికిలబడిపోయింది నన్నారీ, నవ్వినవ్వి తేరుకున్నాక "బలేపేరెట్టే రమ్మాయిగారూ, అలాగేపిలండి మీకు బాగుంటే"అంది అన్నాక మళ్లీ నవ్వింది. సీత కూడా ఆమెతో శృతి కలిపి "బీబీ నాంచారి పేరు బావుండలా? మావెంకన్న బాబు రెండో పెళ్లాం తెల్సా ఆవిడ! మొదటి పెళ్లాం అలివేలు మంగని ఆఁవడ

దూరంలో ఉంచి, రెండో పెళ్లాన్ని ముద్దు కొద్దీ గుండెల మీద పెట్టు కున్నాడాయన' ' అంది.

"అయితే మావోడు కూడా నన్నలాగే ఎట్టు కుంటాడు కావాల్ను" అని కిసుక్కుమంది నన్నారి.


ఆరోజు నుంచీ నన్నారీబేగం బీబీనాంచారైంది. కొత్తవాళ్లెవరడిగినా తనపేరు నాంచారనే చెప్పేది.


త్వరలోనే హాళ్లిద్దరి మధ్యా గాఢమైన స్నేహం ఏర్పడింది. సీతమ్మతోట పనిలో నాంచారీ, నాంచారి కుట్టుపనిలో సీతమ్మా ఒకరికొకరు సాయపడేవారు.

గొప్ప ఇళ్లల్లో పరుపులు కుట్టి సాయెబుబాగా సంపాదిస్తున్న రోజులవి. నాంచారి వాళ్లు ఉంటున్నది పూరిగుడిసే అయినా మంచిబట్టలూ, మంచితిండీ ఉండేవి. నాంచారి బలంగా పుష్టిగా పొన్నచెట్టులా ఉండేది. ఆమె పక్కన సీతమ్మ సన్నజాజి తీగలా బక్కగా ఉండేది. ఒకరోజు నాంచారి పళ్లెంనిండా బియ్యం పోసుకుని, రెండో చేతిలో అరటిపళ్ల అత్తలం పుచ్చుకుని వచ్చింది.

"ఇవన్నీ ఏఁవిటి?" అని తత్తరపడింది సీతమ్మ". నీక్కాదులెయ్యమ్మా గుళ్లో ఉన్న అందాల సీతమ్మ తల్లికి, నాక్కలిగినన్నాళ్లూ వారంవారం ఇలాగే ఇత్తాను. నువ్వెవరు







కాదంటానికి?" అంది నాంచారి దబాయిస్తూ. నెల తిరిగేసరికల్లా తనభర్త ఎందుకూ పనికిమాలిన వాడని సీతమ్మకి అర్థమైపోయింది. కడుపు నిండా తిండి సంపాదించడం కూడా నేర్వని వాడని గ్రహించింది. తనొచ్చింతర్వాత గుళ్లో దేవుడికి దీపం పెట్టడం కూడా మానేసాడు. క్రమంగా ఆలయ నిర్వహణంతా సీతమ్మ మీద పడింది. పుట్టిందీ పెరిగిందీ అదే వాతావరణం కావడం వలన తొందరగానే అలవాటు పడింది. సూర్యుడితోబాటు మేల్కొని, రెండు బకెట్ల నీళ్లు నెత్తిన గుమ్మరించుకుని, ఆలయమంతా కడిగి ముగ్గులు తీర్చి, అభిషేకం చేయించి, పూలుకోసి అలంకరించి, దీపం వెలిగించి, నైవేద్యంపెట్టి హారతిచ్చేది.

గుడి పరిసరాలూ, గుడీ శుభ్రంగా ఉండడం చూసి దారినపోయే వాళ్లొచ్చిదండం పెట్టి కాసేపు కూచుని పోయేవాళ్లు.

"ఇయ్యన్నీ సరేగాని సీతమ్మా, నువ్వు నూతికాడ కూనిరాగాలు తీస్తాఉంటే ఇన్నా. నీగొంతుశానా బాగుండాది. మీ పురాణాలో అరికతలో అయ్యేటో సదువుతారు గందా గుళ్లల్లో. నువ్వూ సదవకూడదా, నలుగురూ వత్తారు" అందోసారి నాంచారి.

"అడదాన్ని, అలాంటి వన్నీ నేను చేస్తే జనం ఏవనుకుంటారో అని భయంగా ఉంది నాంచారి" అంది సీతమ్మ.

"ఓలమ్మా నువ్వేవన్నా, రంకుతనం సెయ్యబోతున్నావా, దొంగతనం సెయ్యబోతన్నావా? నీమారాజు మొగుణ్ణి నమ్ముకుంటే కూటి నీల్లకైనా గతుండాద్దా? ఈ రోజుల్లో దేవుడైనా దెయ్యలైనా కళ్లకి నదురుగా ఆనాల, లేపోతే ఏటీ లేదు" అంది నాంచారి.

మంచిరోజు చూసి తెలిసిన నాలుగు పెద్దిళ్లకీ వెళ్లి సీతమ్మ పురాణ పఠనం చెయ్యబోతోందని చెప్పేసొచ్చింది నాంచారి. ఎంత బాగా చెప్తుందో చిలవలూ పలవలూ కల్పించి మరీ చెప్పింది. మొదటి రోజు నలుగురైదుగురు ముసలమ్మలు మాత్రం వచ్చారు. చిన్నప్పట్నుంచీ కంఠోపాఠం చేసిందే అయినా మొదటి పేజీ తిప్పి ప్రార్థన పద్యాలు చదువుతూంటే గొంతు వణికి పోయి చెమటలు పోసేసాయి. క్రమంగా కథనంలో పడ్డాక ఆమెకి కాలమే తెలీలేదు. రాత్రి పదిగంటల వేళ పేకాట నుంచి తిరిగొచ్చిన క్రిష్ణమాచారి నూతి చప్టామీద కాళ్లు కడుక్కుంటూ గొంతు పట్టేసిన వాడిలా వ్యంగ్యంగా సకిలించడంతో ఈ లోకంలో కొచ్చింది. ఆదరా బాదరా హారతిపాడేసి, వ్యాసపీఠం ముడిచేసింది. "నాయమ్మ నాతల్లే! ఎంత బాగా పాడతన్నావు రాములోరి కత!" ముసలమ్మలంతా ఏకకంఠంతో మెచ్చుకున్నారు.

ఆచారి రాకకి ముందే ముగించెయ్యనందుకు సిగ్గుపడింది సీతమ్మ. అన్నం వడ్డించేటప్పుడు తల ఎత్తడానికి బిడియపడింది.

ఏవనుకున్నాడో ఆచారి మాట్లాడకుండా అన్నం తినేసి పడుకున్నాడు. పొద్దున్నే లేచి రాత్రి హారతి పళ్లెంలో పడిన రూపాయి పావలా జేబులో వేసుకుని అదే పోకపోయాడు.

గుళ్లో ముగ్గులేస్తోండగా దడి అవతల్నుంచి నాంచారి కేకపెట్టింది. "రాత్రి పళ్లెంలో ఏమాత్రం కిట్టింది సీతమ్మా"

సీతమ్మ ఒక్కసారిగా లేచి నిలబడి నాలుగువైపులా పరికించింది ఎవరైనా విన్నారేమోనని సిగ్గుతో. ఇంకానయం, దరిదాపుల్లో ఇంకెవరిళ్లూ లేకపోవడం అనుకుంది" ఛీ, ఏవిటి నాంచారీ నువ్వుమరీనూ కేవలం డబ్బుకోసమా ఇదంతా..." అంది.

నడుంమీద చేతులుంచుకుని నాంచారి సీతని అట్టేపరికించి చూసి "సీతమ్మతల్లీ, నువ్వు తెలివి నేర్చుకోవాల" అనేసి లోపలికి పోయింది. ఆమాట సీతమ్మ గుండెలో అదేపనిగా కదలాడింది.

ఆమధ్యాహ్నం పనంతా ముగిసేక నాంచారిని బతిమలాడితే దానర్థం విప్పిచెప్పింది. "సీతమ్మా, మొగెదవలు స్తిరవెరగనోళ్లు, ఇయ్యాలకుంచెడుంటే కుండకెసరెత్తమంటారు, మానెడుంటే మంటెట్టమంటారు. రేపు పిల్లాజెల్లా పుట్టబోతారు. 'అమ్మా, అన్నవెట్టే' అని మనల్నే గదా అడుగుతారు. ఆడబిడ్డలైతే 'పరికిణీ కుట్టించు, పట్టాలు చెయ్యించు' అని ప్రేనాలు తోడతారు. సంపాదనంతా మొగోడి ఎదాన్నేత్తే ఇంక బిడ్డలకేవుంటాది? అప్పుడెలా నడుత్తాది పడవ? పన్నెండు మంది సంతానం మాయమ్మకిమేవు. మాబాబ, మాయన్నదమ్ములూ కూలీనాలీ సేసి తెచ్చిందాన్ని ఎలాగ కూడ బెట్టేదో మాయమ్మతల్లి ఆడోళ్లందరికీ ముక్కులుకీ సెవులకీ పిసరంతేసి బంగారం మెరిసేలా సేసింది. నూట పదార్లు కట్నాలిచ్చి పెళ్లిళ్లు సేసింది. నాకూ అదే సెప్పింది, ఆడదాని జాగర్తే కుటుంబాన్ని ఆరుగాలాలు కాపాడిద్ది అని. మాసాయెబు రాత్రికి తాగొత్తాడు గదా, తెల్లారేసరికి అది జేబులుకాళీ, నేనే తీసేత్తాను. తెల్లారి ఆడిసావేదో ఆడు సావాల్సిందే గాని నేనొక్క పైసా ఇయ్యను. రేపట్నుంచి గుడికి జనాలొత్తారు. తుణవో పణవో అసారిబాబు పేకాటకెలిపోతే రేపు నీ బిడ్డల గతేంటంట?

నువ్వు నమ్ముతావో లేదో గాని లోకం డబ్బు ఆడించినట్టల్లా ఆడతా ఉంది. కాసులేనోళ్లకి కాటికెల్నా ముక్తిలేదు".

పురాణం వినేవాళ్లు అయిదల్లా పదిమంద్రై, పది ఇరవయ్యై అలా అలా గుడి నిండిపోయేరు. అకాలం అలాంటిది. అటు సినిమాలూ, ఇటు పురాణ కాలక్షేపాలూ ఒక్కలాగే ఆదరించబడ్డాయి. నాటకాలూ, హరికథలూ,. బుర్రకథలూ ఒక్కటేవిటి! కళవెయ్యిరూపాలై విస్తరించి ఆదరణ పొందింది. సీతమ్మపేరు ఉన్న ఊళ్లోనే కాక పరిసర గ్రామాలకే పాకింది. పండగలకీ పబ్బాలకీ పిలిచి పురాణం చెప్పించుకొని విని పదోపరకో, చీరోసారో ఇచ్చి పంపించేవారు.

కాలం గడుస్తూ ఉంది.

నాంచారి నలుగురు బిడ్డల తల్లై అయిదోసారి కడుపుతో ఉంది. చూసి చూసి సీతమ్మనేదో వైరాగ్యం పట్టుకుంది. ఎప్పుడూ పూజలూ పునస్కారాలూ, పురాణ కాలక్షేపం తప్ప మరోధ్యాసే మరచి పోయింది. "సీతమ్మా, ఆసారి బాబు ముత్తేలమ్మతో" అంటూ ఓసారి నాంచారి ఏదో చెప్పబోతే చెవులు మూసుకుంది సీతమ్మ. ఆచారి ఎంతటి పురుష పుంగవుడో ఆమెకి తెలీదా! గుప్పిట విప్పడం ఇష్టంలేక "పోనీ నాంచారీ, ఈ భూమి మీద మనిషి మనుగడే ఝూణ్ణాళ్లు, నవమిపండక్కి నాటకాలు చూస్తున్నాం చూడు, అదిగో అలాగే ఈప్రపంచం నడుస్తోంది. నాటకం అయిపోగానే మన పద్దాలూ, పాపారావూ వాళ్లంతా రంగులు చెరిపేసుకుని మామూలు మనుషులైపోతున్నారుగా, అలాగే మనవందరవూను. బతికున్న మూణ్ణాళ్లూ ఈ ప్రపంచకవనే రంగస్థలం మీద నటించేసి, రంగులు చెరిపేసుకుని ఎక్కణ్ణుంచొచ్చామో అక్కడికి పోతాం. ఈమాత్రం దానికి ఎందుకొచ్చిన తాపత్రయాలు చెప్పు. ఆచారిగారి గురించి కదూ అంటున్నావూ, ఆయనకలా జీవించడంలో ఆనందం కన్పిస్తోంది. ఊఁ .. కానీయ్, అతనిదారికడ్డెళ్లి ఆపాపవెందుకు మూట కట్టుకోవాలీ?"


నాంచారి బుగ్గలు నొక్కుకుంది.

"శానా బాగుంది సీతమ్మా నీఏదాంతం. గాలికొదిలేత్తే గంగిరెద్దు కూడా కుమ్మిపోత్తాది. ముక్కు తాడేసినప్పుడే ఎట్లాడమంటే అట్లాడతాది, ముంగాళ్ల మీద వంగి సెలాం జేత్తాది. మొగుణ్ణట్టా గాలికొదిలేసి, నువ్విట్టా ఏదాంతం జెప్తావుంటే బిడ్డాపాపా కలగొద్దూ? రేపు నీబతుకు ఎళ్లమారేదెట్టా?"

"బిడ్డలు లేనోళ్లందరి బతుకులూ వెళ్లమారటంలే? అలాగే నాబతుకూను అన్నిటికీ ఆదేవుడున్నాడులే"

"ఉంటాడుంటాడు, ఎదవదేముడు, ఆడూ మొగెదవేగదా, ఆడికి మాత్రం నీతీనాయం ఎక్కడేడిసాయిలే, అన్నట్టు నువ్వు పూజలు జేసే రాళ్లల్లో సీతమ్మ తల్లున్నట్టుంది కదా, అయమ్మేవన్నా ఇనిపించుకుంటాదేమో అడుగు, నీమొర" అని నవ్వింది నాంచారి.

"దేవుళ్లని అలా రాళ్లూ రప్పలూ అనకే నాంచారీ, కళ్లుపోతాయ్" అని తనూ నవ్వింది సీతమ్మ "అన్నట్టు నాంచారీ, నువ్వెప్పుడూ మీగుడికెళ్లినట్టు కన్పించవేం?"




"గుడా.. అదా, మసీదుకా? మాదేవుడికి ఆడగాలి కిట్టదు" అని కిసుక్కుమంది నాంచారి. "ఆడోళ్లెవురైనా మసీదుకెల్లటం ఎప్పుడైనా సూసినా? ఆడోల్లందరూ ఇళ్లకాడే ప్రేర్దన సేసుకోవాల"

"ఇంటి దగ్గర కూడా నువ్వెప్పుడూ ఏప్రార్థనా చేసినట్లు కన్పించలేదూ.." అనుమానంగా చూస్తూ అడిగింది సీతమ్మ.

నాంచారి పగలబడి నవ్వింది. "అప్రేర్దనెలా సెయ్యాలో నాకు సేతనైతే గదా! 'నీకు కడుపే కైలాసవే' అంటాడు మాసాయెబు' 'కాలం పరుగెడుతోంది. పైసాపైసా కూడబెట్టి నాంచారి నగనట్రా కొనుక్కున్నది లేదు సరికదా, పిల్లల్తో, సాయెబు సంపాదన చాలక కటకట పడాల్సొస్తోంది. చివరికి నాంచారి కూడా నడుం వంచితేగాని కాలం గడవని రోజులొచ్చాయి. నాంచారికి చేతనైందొక్కటే, చీపుర్లు తయారు చెయ్యడం, గుడిసెవెనక గరపనేలల కట్టవల్లో ఇబ్బడి ముబ్బడిగా ఉన్న పూతిక దుబ్బుల్నుంచి పుల్లలు కోసుకొచ్చి చీపుర్లుగా కట్టి అమ్మడం.

ఆరోజు వాకిట్లో పరిచిన చీపురుపుల్లల్ని దువ్వి కుచ్చులప్రకారం కట్టలు కడుతున్న నాంచారి మొక్కలకి పాదులు కడుతూ రామదాసు కీర్తనలో లీనమై "ఏ తీరుగనను దయజూచెదవో.." అంటూన్న సీతమ్మని పిలిచి "ఇది ఇన్నావా సీతమ్మా! పెద్దపెద్ద ఇళ్లల్లోకి కొత్త రకం పరుపులొచ్చినయ్యంట.

పొమో, పామో ఏటో దానిపేరు, అట్టైతే ఇంక దూదిపరుపుల్లాగా ఏటాఏకించి, కుట్టించక్కర్లేదంట" అంది. "ఆహా!" అంది సీతమ్మ ఏదో ధ్యాసలో.

"మాసాయెబుకింక పనుండదేమో, అదేవంక ఇదేవంకని ఆఎదవ తాగి సస్తన్నాడు" అంది దిగులుగా నాంచారి.

"ఈ బిడ్డల్నెట్టా పెంచాలో ఏవో" ఈ మాటలు చెవినపడ్డాక సీతమ్మ మామూలుగా ఉండలేకపోయింది. ఆమె గుండెలో ఏదో అలజడి మొదలైంది. కాలుకాలిన పిల్లిలా అటూ ఇటూ తిరిగింది. పోసిన మొక్కకే నీళ్లన్నీ తోడిపోసింది, "ఈ పూటకి దేవుడిస్తే తింటాం లేకపోతే లేదు' ' అన్న వేదాంతం ఎలా పనికొస్తుంది? బిడ్డల్లేకనేనా తనకింత నిర్లిప్తత అలవడింది! కట్టుకున్నవాడెక్కడెక్కడ తిరిగొచ్చినా తనకి పట్టనట్టే అన్పిస్తోంది. 'ఈ లోకం ఎలాపోతే నాకెందుకు' అన్పిస్తోందందుకేనా?

""ఏంటి సీతమ్మా మాట్లాడవ్" నాంచారి కేకతో ఉలిక్కిపడి ఈలోకంలో కొచ్చింది

సీతమ్మ. చాన్నాళ్ల తర్వాత ఆరోజు సీతమ్మ తన ట్రంకు పెట్టె బోర్లించి చీర మడతలన్నీ విప్పిదులిపింది. మూడైదులూ, రెండురెళ్లూ, నాలుగొకట్లూ ఎప్పుడోపెట్టి మరచిపోయినవి; ఆచారి కంటపడక ఉండిపోయినవి దొరికాయి. వాటిని గుప్పెట్లో పట్టుకుని దడి దగ్గరకెళ్లి "నాంచారీ!" అని పిలిచింది. "ఏంటమ్మా' అంటూ వచ్చిన నాంచారి చెయ్యందుకుని చిల్లర ఆమె చేతిలోపోసి, గుప్పిట మూసింది. "తీసుకోకుంటే నామీద ఒట్టే' అంది.

నాంచారి కళ్లల్లోకి నీళ్లు చివ్వున చిమ్ముకొచ్చాయి. "దేవుడంటే నమ్మకంలేని నాకు ఒట్టుమీదెట్టా నమ్మకవుంటాదనుకున్నావే పిచ్చిదానా! ఎవుళ్లకాపరాల బరువు ఆళ్లు మోసుకోవాలగానీ, మరొకళ్లనెత్తికెత్తడం మర్యాదగాదు, నువ్వు నొచ్చుకుంటావని పుచ్చుకుంటన్నా" అంది రెండు రోజులకో చీపురు కొంటున్న సీతమ్మని ఓసారి నిలదీసింది. నాంచారి "ఏం తల్లే! రూపాయలెక్కువయ్యేయా? మూడేసి రూపాయల చీపురుకట్టని రెండు రోజుల్లోనే నమిలి మింగేత్తన్నావా." గుళ్ళో నాపరాళ్ల గచ్చుకదా నాంచారీ, చీపుర్లు ఇట్టే అరిగిపోతున్నై' అనేది సీతమ్మ. కొత్తగా కుట్టుపని నేర్చుకుంటున్నానని మొదలుపెట్టి తనవీ, గుళ్లో సీతమ్మ తల్లివీ చీరలు చింపి నాంచారి పిల్లలకి లంగాలూ జాకెట్లూ కుట్టి ఇచ్చేది.

కాలంతో బాటు మనుషుల్లోనూ మార్పొచ్చింది. పాతతరం వాళ్లంతా వెళ్లిపోయారు. పురాణ పఠనాలూ, పుణ్యకార్యాలూ జాటాఫ్‌ఫేషనై పోయాయి. గుడికెళ్లడం మరీ అర్ధడాక్స్ సిస్టమ్ అయ్యింది పల్లెల్లో. గుడికొచ్చే జనం తగ్గారు.


నాలుగు రాళ్లొచ్చినప్పుడు వెనకేసుకోవడం ఎరగని సీతమ్మ అప్పుడు ఆనందంలో తలమునకలై పోనూలేదు, ఇప్పుడు విచారంలో మగ్గిపోవడమూ లేదు. ఒంట్లోని శక్తి ఉడుగుతూ ఉన్నా ఆలయసేవ మాత్రం ఆమె జీవితంలో ముఖ్యభాగమై పోయింది.

ఆచారి నడుం నొప్పితో మంచం పట్టేడు. అతని వైద్యంకోసం గుళ్లో పంచపాత్రా, ఇత్తడిపళ్లెం, రాగి శఠగోపం, దీపాలకుందె ఒకటొకటీ కాళ్లొచ్చి నడిచెళ్లాయి.

సీతమ్మ నెరిగున్న రైతు కుటుంబాలవాళ్లు పంపించే మానెడో అడ్డెడో గింజల్తోనూ, రాతి మీద చితక్కొట్టిన చింతకాయ కారంతోనూ కాలం గడుస్తోంది. గుళ్లో దీపం పెట్టేందుకు నూనెలేక సీతమ్మ గుండె పిండి నట్లవుతోంది.

అటునాంచారి పరిస్థితీ అలాగే ఉంది.

"సీతమ్మా, నువ్వు సాలాపురాణాలు సదువుకున్నావు గందా, లోకంలో ఏదిగే వోళ్లంతా మేడలూ మిద్దెల్తో అలాగలాగ పైకెదిగిపోతావుంటే మన్లాంటోళ్లం ఇంకా ఇంకా అట్టడుక్కి దిగిపోతన్నావెందుకు?'




' అనడిగిందోసారి నాంచారి.

సీతమ్మ ఆర్థిక శాస్త్రం చదువుకోలేదు. అందుకే, అదంతా కర్మ సిద్ధాంతం కింద తేల్చేసింది. "అదివాళ్లు చేసుకున్న పుణ్యం, ఇది మనం చేసుకున్న పాపం" అంటూ.

కల్తీ సారా తాగి పీరు సాయెబు చచ్చిపోయినప్పుడు పిల్లలంతా గొల్లుమంటుంటే నాంచారి రాయిలా కూర్చుంది. అంతా ముగిసేక సీతమ్మ అడిగింది "నాంచారీ, ఇంతకాలం అతన్తో కలిసి కాపురం చేసేవు కదా, నీకసలు ఏడుపేరాలేదా?"

ఉక్రోషంగా నవ్వి నాంచారి, "సీతమ్మా, ఒక మనిషి సచ్చిపోవడవంటే ఈ బూవికి కొంత బరువొదిలినట్టే, అందునా, ఎవరికీ ఉపయోగపడని మనిసి. ఆడు తాగితాగి ఏదో ఒకరోజు కుక్కసావు సచ్చేటోడే కదా, పోతే పోయేడులే" అంది.

"పాపం, సంపాదించినంత కాలం సంపాదించేడు కదా!"

"ఆ, సంపాదించేడు, నేను కాదన్ను. కాని, పాడుపొట్టకియ్యాల తింటే రేపటికి పరగడుపే గదా! పెళ్లి కెదిగిన ఇద్దరాడబిడ్డలు కళ్లెదురుంగా తిరగతన్నారే! రెక్కల కట్టం జేసుకునే వోడెవడైనా నాకొక్క పనే ఒచ్చు, నేనాపనైతేనే జేత్తా, లేపోతే కడుపులోకి కాళ్లు దూర్చుకుని బబ్బుంటానంటే ఎట్టా కుదురుద్ది? అలాంటెదవలకి సంసారాలెందుకు? బిడ్డల్ని కనుకోడలెందుకు? కట్టుకున్న పాపానికి ఆడది పడరాని పాట్లన్నీ పడి, తొక్కరాని దార్లన్నీతొక్కి ఆణ్నీ, ఆడి బిడ్డల్నీ పెంచాలా? ఆయుర్దాయం ఉన్నంతకాలం సవ్యంగా బతక వలిసిన బాధ్యత మనిసికి లేదూ! మొగోడు ఎదవ నాటకాలాడి ఒల్లుగుల్ల సేసుకుంటే ఆడెనకాలోళ్లు ఏవైపోవాల?" ఎన్నడూ లేని విధంగా గొల్లుమంది నాంచారి.

ఓదార్పుగా నాంచారి భుజం మీద చెయ్యేసి దగ్గరకు లాక్కుంది సీతమ్మ.

తెల్లవారు ఝామునుంచీ క్రిష్ణమాచారి ఆయాసంతో రొప్పుతున్నాడు. ఎక్కడైనా కాసిన్ని నూకగింజలు దొరుకుతాయేమో, అతనికి కాస్త గంజికాచి తాపిద్దామనుకున్న సీతమ్మ ఇల్లంతా వెదికింది. ఎప్పుడూ ఎవర్నీ ఏదీ చెయిచాచి అడిగి ఎరగని సీతమ్మకి ఆక్షణంలో దుఃఖం ముంచుకొచ్చింది.

"ఆ ఏడుపెందుకే పాపిష్టిలంజా! అందాన్నెలా ఉపయోగించుకోవాలో తెలీని పిచ్చిముండవు నువ్వు, 'ఊఁ' అంటే మళ్లూ మాన్యాలూ రాసివ్వడానికి సిద్ధంగా పెదరెడ్డి ఉన్నాడని నీకేనాడో చెప్పేను. చెవిన పెట్టేవా? మహాపుణ్యాత్మురాలి పోజుకొట్టి పురాణాలు పట్టుకుని వేళ్లాడేవు. ఇప్పుడేమైంది? బంగారంలాంటి

అవకాశమూ పోయింది, ఆనాటి రూపమూ పోయింది.'' ఆయాసపడుతూ అరుస్తున్నాడు ఆచారి.

చేతిలో గిన్నెతో వాకిట్లో కొచ్చి నిల్చున్న సీతమ్మని చూసి నాంచారి బైటికొచ్చింది "ఏంటి సీతమ్మా" అంటూ.

"నాంచారీ, రాముడికీ రోజు నైవేద్యంలేదు'
'

''పిల్లలకోసం కాసిన అంబలి తప్పమరేంలేదు సీతమ్మా ఇంట్లో, దాన్ని కూడా ఆళ్లు ఎంగిలి చేసేసేరు"

"అదే ఇవ్వు" గిన్నె ముందుకు చాపింది సీతమ్మ.

"అయ్యో అయ్యో" నొచ్చుకుంది నాంచారి, "నేనెంత దేవుడూ దెయ్యంలేవనేటిదాన్నైనా మరీ అంత పాపానికి ఒడిగట్టుకోలేను సీతమ్మా"

సీతమ్మ చిరునవ్వు చెరగనీకుండా అంది "నువ్వే కరెక్టు నాంచారీ! దేవుడూ లేడు దయ్యమూ లేదు, ఎక్కడో పడున్న రాయిని తెచ్చి రూపం చెక్కి అదిగో అలా గాలీవెలుతురూ లేని గదిలో కూర్చుండబెట్టి సకలసేవలూ చెయ్యడం.. అదంతా పిల్లలాడుకునే బొమ్మ లాటలాంటిది. ఈపనికి మాలిన దేవుడుకోసం ఆవేశాలకూ కావేశాలకు పోయి అనర్ధాలను కొని తెచ్చుకోవడం ఉత్తదండగ మారి పని. ఇంక, మనం అనుకునే పాపం పుణ్యం మరెక్కడో లేవు, మనమనసుల్లోనే ఉన్నాయి. ప్రేమతో బాటు అన్నీ అమరిన వాళ్ల జీవితాలు స్వర్గాలూ, ఏమీ లేని వాళ్ల జీవితాలు నరకాలూ. నేనిన్నాళ్లా నరకంలోనే బతికేను తెలుసా నీకు! నీ ఇంట్లో ఉన్న ఆ అంబలినే కొంత పోసివ్వు, రాయిలాంటి దేవుడికీ, నికృష్టుడైన మానవుడికీ ఎంగిలి కూడైనా ఫర్వా లేదులే. నిజానికి నీ పుణ్యపు చేతితో ఇచ్చిన అంబలి తాగే అర్హత వాడికే లేదు".

●

